ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజా ప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :281బుధవారం ఆగష్టు 5 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

# అవినీతి దందాను తలపిస్తున్న...


## విశాఖపట్నం జిల్లా గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం




**మామూళ్ల మత్తులో విశాఖపట్నం జిల్లా గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ..?సిండికేట్ గ డాక్యుమెంట్ రైటర్ల రాజ్యం ..?ప్రతి రిజిస్ట్రేషన్‌కు భారీ వసూళ్ల ఆరోపణలు.. ప్రభుత్వ నిబంధనలు గాలికొదిలేశారా..?ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాల్సిన విశాఖపట్నం జిల్లా గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ అవినీతి ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. కార్యాలయం పరిధిలో డాక్యుమెంట్ రైటర్ల సిండికేట్ ఏర్పడి, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై పూర్తి ఆధిపత్యం చలాయిస్తున్నారని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు.!**

(ఆంధ్రప్రదేశ్ స్టేట్ బ్యూరో ప్రత్యేక కథనం విశాఖపట్నం జిల్లా గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం)మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక నిఘాలో భాగంగా డాక్యుమెంట్ రైటర్లదే హవా ..?కార్యాలయం ఆవరణలోనే లేదా పరిసరాల్లో డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయ వ్యవహారాలపై ప్రభావం చూపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు కాకుండా ప్రైవేట్ వ్యక్తులే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.తక్కువలో తక్కువ 20,000 ఇరవై వేల రూపాయల నుండి 50,000 యాభై వేల వరకు అదనపు వసూళ్లు ..? విశాఖపట్నం జిల్లా గాజువాక సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంటు రైటర్లకు అనుసంధాన కర్తగా పనిచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయిసాధారణ రిజిస్ట్రేషన్లకు వేళల్లో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్లకు లక్షల్లో డిమాండ్లు చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. దీనివల్ల సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని బాధితులు వాపోతున్నారు.

**ప్రభుత్వ నిబంధనలు కేవలం పేపర్ పైనే ..?**ప్రభుత్వం రూపొందించిన రిజిస్ట్రేషన్ విధానాలు కచ్చితంగా అమలు కావడం లేదని విమర్శలు ఉన్నాయి. ?పారదర్శక వ్యవస్థకు బదులుగా మధ్యవర్తుల ఆధిపత్యం పెరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.విశాఖపట్నం జిల్లా గాజువాక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రైవేట్








వ్యక్తుల హవా..?అధికారిక అనుమతులు లేకుండానే కొందరు డాక్యుమెంట్ రైటర్లు ప్రజలతో నేరుగా వ్యవహరిస్తూ, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జోక్యం చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.**సిండికేట్ వెనుక ఎవరి అండ..?**డాక్యుమెంట్ రైటర్ల సిండికేట్ ఇంత బలంగా ఎలా ఏర్పడింది? వీరికి ఎవరి అండదండలు ఉన్నాయి? అధికారుల పర్యవేక్షణ ఎందుకు కనిపించడం లేదన్న ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.**ప్రభుత్వ ఆదాయానికీ భారీగా గండి .?**రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం, అనధికార వసూళ్లు, మధ్యవర్తుల జోక్యం కారణంగా ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతోందా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.**ఏసీబీ, విజిలెన్స్ విచారణకు డిమాండ్..**విశాఖపట్నం జిల్లా గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్నాయని చెబుతున్న అక్రమాలపై ఏసీబీ, విజిలెన్స్, ఉన్నత రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు. కార్యాలయ పరిధిలోని అనధికార డాక్యుమెంట్ రైటర్ షాపులను తొలగించి, పారదర్శక రిజిస్ట్రేషన్ వ్యవస్థను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. **వేచి చూడండి అతి త్వరలో మీ ముందుకు మరో సంచలనాత్మక కథనంతో మీ మా మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రికలో**

మన
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
# ప్రజా ప్రతినిధి
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :281 బుధవారం ఆగష్టు 5 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## రైళ్లలో ట్రాన్స్‌జెండర్‌ల వేధింపులు

- ప్రయాణికుల నుంచి పెరుగుతున్న ఫిర్యాదులు
- బలవంతంగా డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలు
- రైల్వేల్లో కఠిన చర్యలకు డిమాండ్
- ప్రయాణికుల భద్రతపై ఆందోళన




ఆగస్టు 4 (మనప్రజాప్రతినిధి): దేశంలోని పలు రైళ్లలో కొందరు ట్రాన్స్‌జెండర్‌లు ప్రయాణికులను బలవంతంగా డబ్బులు అడుగుతున్నారనే ఫిర్యాదులు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి. డబ్బులు ఇవ్వకపోతే దురుసుగా ప్రవర్తించడం, అసభ్యకరంగా వేధించడం వంటి ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయి. ప్రయాణికుల కథనం ప్రకారం, రద్దీగా ఉండే రైళ్లలో కొందరు ట్రాన్స్‌జెండర్‌లు బోగీల్లో తిరుగుతూ డబ్బులు డిమాండ్ 2

## వాషింగ్టన్‌లో కార్చిచ్చు విలయం



- 65 వేల మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- 700కుపైగా ఇళ్లు, నిర్మాణాలు దగ్ధం
- కార్చిచ్చుకు కారణమన్న ఆరోపణలతో వ్యక్తి అరెస్ట్
- రాష్ట్రంలో అత్యవసర పరిస్థితి ప్రకటించిన ట్రంప్

2

## వరంగల్‌లో అతిపెద్ద క్యాన్సర్ ఆస్పత్రి



- ౦ండో అతిపెద్ద ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు
- ఏడాది చివరికి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం
- ఉత్తర తెలంగాణకు వైద్య సేవల కేంద్రంగా వరంగల్
- వైద్య సేవలపై మంత్రుల సమీక్ష సమావేశం

2

## రహ్మత్ పాషాను అభినందించిన కేటీఆర్



- బోండీ ఘటనలో ధైర్యసాహసాలకు ప్రశంసలు
- 20 మంది ప్రాణాలు కాపాడిన హైదరాబాద్ యువకుడికి అభినందనలు
- ఆస్ట్రేలియా శాశ్వత నివాస హోదాపై హర్షం వ్యక్తం
- యువతకు రహ్మత్ పాషా స్ఫూర్తిగా నిలుస్తారని కేటీఆర్ వ్యాఖ్య

2

## కేంద్ర మంత్రితో బీజేపీ ఎంపీల భేటీ

- భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశం
- సీసీఐ, బీహెచ్ఈఎల్, బీడీఎల్ సమస్యలపై వినతి
- హెచ్ఎంటీని రక్షణ రంగంలోకి తీసుకురావాలని ఈటల రాజేందర్ విజ్ఞప్తి
- తెలంగాణ పరిశ్రమల అభివృద్ధిపై విస్తృత చర్చ



న్యూఢిల్లీ, ఆగస్టు 4 (మనప్రజాప్రతినిధి): తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీల బృందం మంగళవారం కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని న్యూఢిల్లీలో కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక పారిశ్రామిక అంశాలపై చర్చించింది. ఎంపీ ఈటల రాజేందర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో ఆదిలాబాద్, తాండూర్ ప్రాంతాల్లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) యూనిట్ల పరిస్థితి, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్), భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సంస్థలకు సంబంధించిన వివిధ సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు ఈటల రాజేందర్ తెలిపారు. ఆయా సంస్థల అభివృద్ధి, విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న హెచ్ఎంటీ సంస్థకు కొత్త ఊపిరి పోయాలని కూడా ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. హెచ్ఎంటీని రక్షణ శాఖ పరిధిలోకి తీసుకొచ్చి, ఆయుధాల విడిభాగాల తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. దీనివల్ల సంస్థ పునరుద్ధరణతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని వివరించారు. తెలంగాణలో ప్రభుత్వ రంగ పరిశ్రమలను బలోపేతం చేయడం ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఎంపీల బృందం అభిప్రాయపడింది. రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలకు అవసరమైన కేంద్ర సహకారం అందించాలని, పెండింగ్ అంశాలను సానుకూలంగా పరిశీలించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి ఎంపీలు ప్రస్తావించిన అంశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను సంబంధిత అధికారులతో 2

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి



- నూతన భవనాలను ప్రారంభించిన మంత్రి సీతక్క
- కష్టపడి చదివి రాష్ట్రంలో తొలి స్థానంలో నిలవాలని పిలుపు
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యపై దృష్టి
- రామప్ప ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి

2

## ఉప ముఖ్యమంత్రిని కలిసిన బీజేపీ నేత



- పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన శివ్ ప్రకాష్
- ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న బీజేపీ నేతలు
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష
- భేటీలో రాష్ట్ర బీజేపీ నాయకుల పాల్గొనిక

అమరావతి, ఆగస్టు 4 (మనప్రజాప్రతినిధి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను భారతీయ జనతా పార్టీ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి శివ్ ప్రకాష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఇటీవల భుజానికి శస్త్రచికిత్స 3

# వాషింగ్టన్‌లో కార్చిచ్చు విలయం

మెదటి పేజీ తరువాయి



వాషింగ్టన్, ఆగస్టు 4 (మన ప్రజాప్రతినిధి): అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రంలో కార్చిచ్చులు తీవ్ర విధ్వంసం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా తూర్పు వాషింగ్టన్‌లోని స్పోకేన్ నగరం, పరిసర ప్రాంతాల్లో మంటలు వేగంగా వ్యాపిస్తుండటంతో సుమారు 65 వేల మందికి పైగా తమ ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ఈ విపత్తులో వందలాది ఇళ్లు, ఇతర నిర్మాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అధికారుల వివరాల ప్రకారం స్పోకేన్ నగర పరిసరాల్లో చెలరేగిన మూడు ప్రధాన కార్చిచ్చులు ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదు. ఇది తమ ప్రాంతం చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ప్రకృతి విపత్తులలో ఒకటిగా స్పోకేన్ మేయర్ లీసా బ్రౌన్ పేర్కొన్నారు. ప్రాణనష్టం, ఆస్తినష్టంపై అధికారులు సమగ్రంగా అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అమెరికన్ రెడ్ క్రాస్ ప్రాథమిక అంచనా ప్రకారం ఇప్పటివరకు 700కుపైగా ఇళ్లు, ఇతర నిర్మాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు ఆహారం, తాగునీరు, అత్యవసర సదుపాయాలు అందిస్తున్నారు. ‘ఓల్డ్ ట్రెయిల్స్ ఫైర్‘కు సంబంధించి ఆరోన్ ఎఫ్. ఫారినా (37) అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉద్దేశపూర్వకంగా మంటలు పెట్టినట్లు ఆరోపిస్తూ అతనిపై ప్రథమ శ్రేణి నేరం కింద కేసు నమోదు చేశారు. ఒక మిలియన్ డాలర్ల పూచీకత్తుతో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు స్పోకేన్ కౌంటీ షెరీఫ్ జాన్ నోవెల్స్ వెల్లడించారు. మంటల కారణంగా సర్వం కోల్పోయిన బాధితులు తిరిగి తమ ఇళ్లకు చేరుకుని కాలిపోయిన శిథిలాలను చూసి భావోద్వేగానికి గురవుతున్నారు. “ఇక్కడ కాపాడుకోవడానికి ఏమీ మిగల్లేదు“ అని 76 ఏళ్ల మిరియం సిమ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ప్రారంభమైన మంటలు ఇప్పటికే 8,026 ఎకరాలకు పైగా విస్తరించాయని అధికారులు తెలిపారు. వాతావరణం కొంత అనుకూలించడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. పరిస్థితిపై రాష్ట్ర గవర్నర్ బాబ్ ఫెర్గుసన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఈ వారం ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# రైళ్లలో ట్రాన్స్‌జెండర్‌ల వేధింపులు

మెదటి పేజీ తరువాయి



చేస్తున్నారని, నిరాకరిస్తే అసభ్యంగా మాట్లాడటం, బెదిరించడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని చెబుతున్నారు. మహిళలు, వృద్ధులు, కుటుంబాలతో ప్రయాణించే వారు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొంటున్నారు. ఇలాంటి ఘటనలపై రైల్వే రక్షణ దళం, ప్రభుత్వ రైల్వే పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, చట్టవిరుద్ధంగా ప్రయాణికులను వేధించే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రద్దీ మార్గాల్లో భద్రతా బలగాల గస్తీని మరింత పెంచాలని సూచిస్తున్నారు. అయితే, చట్టాన్ని ఉల్లంఘించే వ్యక్తులపైనే చర్యలు తీసుకోవాలని, కొందరి ప్రవర్తనను మొత్తం ట్రాన్స్‌జెండర్ సమాజానికి ఆపాదించడం సరైంది కాదని సామాజిక వర్గాలు పేర్కొంటున్నాయి. గౌరవప్రదంగా జీవనం సాగిస్తున్న ట్రాన్స్‌జెండర్‌ల హక్కులను కాపాడుతూనే, ప్రయాణికులను వేధించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడుతున్నాయి. ప్రయాణికుల భద్రత కోసం రైల్వేల్లో నిఘాను మరింత పటిష్ఠం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. సీసీటీవీ పర్యవేక్షణ, ఆర్‌పీఎఫ్ గస్తీ, అత్యవసర ఫిర్యాదు వ్యవస్థలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ఇలాంటి ఘటనలను అరికట్టవచ్చని అభిప్రాయపడుతున్నారు. ప్రతి ప్రయాణికుడు భయాందోళనలు లేకుండా సురక్షితంగా ప్రయాణించే వాతావరణాన్ని కల్పించడం రైల్వేల బాధ్యతగా నిపుణులు పేర్కొంటున్నారు. చట్టాన్ని ఉల్లంఘించి ప్రయాణికులను వేధించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజల్లో అవగాహన పెంచే చర్యలు కూడా చేపట్టాలని సూచిస్తున్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

మెదటి పేజీ తరువాయి




ములుగు, ఆగస్టు 4 (మన ప్రజాప్రతినిధి): విద్యార్థులు ఇష్టంతో, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, పోటీ ప్రపంచంలో ప్రతిభ చాటాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. మంగళవారం వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ గ్రామంలో సమగ్ర శిక్ష పథకం కింద రూ.2.30 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నూతన భవనం, అదనపు తరగతి గదులు, ప్రయోగశాల భవనాలను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి కంప్యూటర్ విద్యపై అవగాహన ఎంతో అవసరమని అన్నారు. పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏదీ లేదని పేర్కొన్నారు. గొప్ప విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని, విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, ధ్యానం కూడా జీవితంలో ముఖ్యమని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేటు విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు మంత్రి సూచించారు. ఆధునిక బోధనా పద్ధతులను అనుసరించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. రానున్న పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలోనే ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, పాఠశాలల్లో విద్యాబోధన, మధ్యాహ్న భోజన నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు వెల్లడించారు. మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతున్నారని, విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి సీతక్క పాలంపేటలోని రామప్ప ఆలయం వద్ద ప్రసాద్ పథకం కింద రూ.61.99 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# కేంద్ర మంత్రితో బీజేపీ ఎంపీల భేటీ

మెదటి పేజీ తరువాయి



సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నట్లు తెలిసింది. ఈ సమావేశంలో ఎంపీలు డీకే అరుణ, మాధవనేని రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోడం నగేష్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన పారిశ్రామిక అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం కొనసాగిస్తూ తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తామని ఈటల రాజేందర్ తెలిపారు.

# వరంగల్‌లో అతిపెద్ద క్యాన్సర్ ఆస్పత్రి

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, ఆగస్టు 4 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రిని వరంగల్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందించేందుకు వరంగల్ ప్రాంతీయ క్యాన్సర్ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఈ ఏడాది చివరికల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖతో కలిసి వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో ప్రభుత్వ వైద్య సేవలపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, జనరల్ ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఎమ్మెల్యేలు సూచించిన సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎంజీఎం ఆస్పత్రిలో ప్రస్తుతం 29 ప్రత్యేక విభాగాల్లో వైద్య సేవలు అందుతున్నాయని, త్వరలో మరో తొమ్మిది సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఉత్తర తెలంగాణ ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించే ప్రధాన వైద్య కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. నిమ్స్ తరహాలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఎల్‌వోసీలు మంజూరు చేసి, అత్యాధునిక వైద్య పరికరాలు, అవసరమైన నిపుణులైన వైద్యులు, సిబ్బందిని నియమించి పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. జనగామ, నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలలను కూడా మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. హనుమకొండలో ఐవీఎఫ్ కేంద్రంతో పాటు ఔషధ, ఆహార పరీక్షల ప్రయోగశాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రాంతీయ నేత్ర ఆస్పత్రిలో అత్యాధునిక కంటి వైద్య సేవలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పరకాల, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, బచ్చన్నపేట, పాలకుర్తి, కమలాపూర్ ప్రాంతాలకు ఇప్పటికే మంజూరైన డయాలసిస్ కేంద్రాలను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, అత్యాధునిక వైద్య పరికరాలు, ఔషధాలు, నిర్ధారణ సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లా స్థాయిలోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్, గాంధీ, ఉస్మానియా వంటి ప్రధాన ఆస్పత్రులపై రోగుల ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

# రహ్మాత్ పాషాను అభినందించిన కేటీఆర్

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, ఆగస్టు 4 (మనప్రజాప్రతినిధి): ఆస్ట్రేలియాలోని బోండీ ప్రాంతంలో జరిగిన విషాద ఘటనలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి పలువురి ప్రాణాలను కాపాడిన హైదరాబాద్‌కు చెందిన భారతీయ మూలాల వ్యక్తి రహ్మాత్ పాషాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. దాదాపు 20 మంది ప్రాణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషించిన రహ్మాత్ పాషాకు ఆస్ట్రేలియా ప్రభుత్వం శాశ్వత నివాస హోదా కల్పించడం ప్రతి భారతీయుడికి, ముఖ్యంగా తెలుగు సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. రహ్మాత్ పాషా ప్రదర్శించిన ధైర్యం, మానవత్వం అసాధారణమని కేటీఆర్ కొనియాడారు. బోండీ ఘటన సమయంలో ప్రాణాలకు తెగించి గాయపడిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం ద్వారా అనేక కుటుంబాల్లో విషాదాన్ని నివారించగలిగారని అన్నారు. సమాజం కోసం నిస్వార్థంగా సేవ చేయాలనే భావనను ఆయన తన కార్యాచరణతో చాటిచెప్పారని ప్రశంసించారు. బోండీ బీచ్ సమీపంలో ఒక ప్రయాణికుడిని దింపిన అనంతరం పెద్ద శబ్దాలు వినిపించడంతో తొలుత వాటిని బాణాసంచా శబ్దాలుగా భావించిన రహ్మాత్ పాషా, పరిస్థితిని గమనించి వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. దుండగుడు దాడి చేస్తున్నట్లు గుర్తించిన ఆయన అక్కడి నుంచి వెళ్లిపోకుండా గాయపడిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొని అనేక మంది ప్రాణాలను రక్షించేందుకు విశేషంగా కృషి చేశారు. రహ్మాత్ పాషా చూపిన ధైర్యసాహసాలను గుర్తించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆయనకు శాశ్వత నివాస హోదా మంజూరు చేయడంతో పాటు ప్రతిష్ఠాత్మక బ్రేవరీ అవార్డుకు కూడా నామినేట్ చేసినట్లు సమాచారం. ఆయన సేవలను తాను పనిచేసిన రైడ్ షేరింగ్ సంస్థ కూడా ప్రత్యేకంగా గుర్తించి అభినందించినట్లు వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారి ఖ్యాతిని మరింత పెంచేలా రహ్మాత్ పాషా చేసిన సేవలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని కేటీఆర్ అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ధైర్యంగా వ్యవహరించి మానవ ప్రాణాలను కాపాడడం ఎంతో గొప్ప విషయమని, సమాజం కోసం సేవ చేయాలనే స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేష్ బిగాల, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, నిశీధర్ బొర్రా, వేణు తదితరులు పాల్గొని రహ్మాత్ పాషాను ఘనంగా అభినందించారు. రహ్మాత్ పాషా ధైర్యసాహసాలు, సేవాభావం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకోవడం ప్రతి తెలుగు వ్యక్తికి గర్వకారణమని, సమాజం కోసం నిస్వార్థంగా సేవ చేసే వారికి ఆయన స్ఫూర్తిగా నిలుస్తారని నాయకులు పేర్కొన్నారు.

# బి ఎల్ ఓ.లను సన్మానించిన చేర్యాల పట్టణ బిజెపి నాయకులు



మనప్రజాప్రతినిధి/చేర్యాల,జనగామ:జనగామ నియోజకవర్గం.భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర నాయకులు మరియు చేర్యాల మున్సిపాలిటీ సర్ పట్టణ ఇన్చార్జి బూరుగు సురేష్ గౌడ్,అధ్యక్షతన చేర్యాల మున్సిపాలిటీలో పదిహేను బూతులలో 99. 97 శాతం సర్ ప్రక్రియ పూర్తి చేసిన పదిహేను మంది బిఎల్ఓ లను ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జ్ కె వి ఎల్.ఎన్.రాజు,మాట్లాడుతూ చేర్యాల పట్టణ కేంద్రంలో సర్ ప్రక్రియ 99.97 % పూర్తి చేసిన బిఎల్ఓ లను శాలువాలతో సత్కరించి వారి ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్రియ వల్ల బోగస్ ఓట్లు అర్హులైన భారత పౌరులందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా అదేవిధంగా విదేశీ శక్తుల ఆటలు చెల్లకుండా దొడ్డి దారిన దొంగ ఓట్ల తోటి ప్రభుత్వాలు ఏర్పడకుండా ఈ ప్రక్రియను చేపట్టడం జరిగింది దేశవ్యాప్తంగా కూడా ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయడం జరిగింది.కాబట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం ఈ కార్యక్రమాన్ని బిఎల్వోలతోటి విజయవంతంగా పూర్తి చేస్తున్నారు కాబట్టి రానున్న రోజుల్లో ఏ ప్రభుత్వం వచ్చినా ప్రజలు ఎన్నుకున్న ప్రజలు ఓట్లేసి గెలిపించిన ప్రభుత్వాలే వస్తాయని చెప్పడం జరిగింది అదేవిధంగా పన్నెండవ వార్డు నలబై మూడవ బూత్ అధ్యక్షులు గుడ్ల అంజయ్య,అనారోగ్యంతో ఉన్న వారిని పరామర్శించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పోతుగంటి రామదాసు మరియు గుర్జకుంట సర్పంచ్ కాసెట్టి పాండు,సంజీవరెడ్డి, మరియు బిజెపి దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కాటం సురేందర్,బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి మనీష్,బిజెపి సీనియర్ నాయకులు ఆకుల శివయ్య, మరియు అవుశర్ల నర్సింలు,కొట్టే చంద్రమౌళి,మన్నె సత్య వర్ధన్,బిట్ల వెంకటేష్,ఉప్పల నాగరాజు,బింగి శీను,ముస్త్యాల శ్రీనివాస్,ఇప్పకాయల సత్యనారాయణ,రమేష్,తదితరులు పాల్గొన్నారు.







# ఉప ముఖ్యమంత్రిని కలిసిన బీజేపీ నేత




చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివ్ ప్రకాష్ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆయన త్వరితగతిన కోలుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. భేటీలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ మధుకర్ కూడా పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్‌తో పలు అంశాలపై వారు చర్చించినట్లు సమాచారం.ఇటీవల శస్త్రచికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు పవన్ కళ్యాణ్ విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఆయనను పరామర్శిస్తూ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు. పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి కొనసాగిస్తున్నట్లు జనసేన పార్టీ వర్గాలు తెలిపాయి. త్వరలోనే ఆయన పూర్తిస్థాయిలో విధుల్లోకి తిరిగి రానున్నట్లు పేర్కొన్నాయి. ఈ మర్యాదపూర్వక భేటీ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరు పార్టీల నేతలు సత్సంబంధాల నేపథ్యంలో సమావేశమైనట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.


# అప్పుల బాధతో చెరువులో దూకి రైతు బలవన్మరణం





మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ:జనగామ నియోజకవర్గం. అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన చేర్యాల మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల మండలం కొత్త దొమ్మాట గ్రామానికి చెందిన యువ రైతు శెట్టె రామస్వామి (38) వ్యవసాయం కోసం ఆవుల షెడ్డు నిర్మాణం,బోర్లు వేయడం వంటి పనులకు అప్పులు చేశారు.అప్పులు తీర్చలేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన రామస్వామి సోమవారం సాయంత్రం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడ్డారు. అనంతరం తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరి చేర్యాలకు వెళ్లి పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు.గమనించిన స్థానికులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు,మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.మృతుని భార్య శెట్టె లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి తల్లి,భార్య,ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు.మృతుని తండ్రి కనకయ్య చాలా సంవత్సరాల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు.సోదరుడు కూడా కొన్నాళ్ల క్రితం మృతి చెందాడు.ఆ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న రామస్వామి ఆత్మహత్య చేసుకోవడంతో ఆ కుటుంబం,శోక సంద్రంలో మునిగిపోయింది.ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఆకునూరులో జీవవైవిధ్య యాజమాన్య కమిటీ ఏర్పాటు




మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల: జనగామ నియోజకవర్గం.జీవైవిధ్య (సవరణ) చట్టం,2023 మరియు తెలంగాణ జీవవైవిధ్య నియమ నిబంధనలు,2015 ప్రకారం చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో జీవవైవిధ్య యాజమాన్య కమిటీని ఏర్పాటు చేశారు.గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీకి చైర్మన్‌గా కొమ్ము రవి,కార్యదర్శిగా కొయ్యడ సందీప్ కుమార్,కమిటీ సభ్యులుగా అందె అశోక్,కడారి భాస్కర్, సాత్పాడి శ్రీనివాస్,తుంగ స్వప్న,కొమ్ము రేణుక,మొత్తం ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు.ఇందులో ఇద్దరు మహిళా సభ్యులు ఉన్నారు.గ్రామంలోని సహజ వనరులు,జీవవైవిధ్యం పరిరక్షణ,స్థానిక జాతుల సంరక్షణ, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి బాధ్యతలు ఈ కమిటీకి ఉంటాయని అధికారులు తెలిపారు.కమిటీ నియామకంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# దేశ భవిష్యత్తు యువతపై ఉంది వ్యసనాలకు దూరంగా ఉండాలి




సదాశివపేట//(మన ప్రజాప్రతినిధి): మంగళవారం ఈరోజు సదాశివపేట కేజీబీవీ పాఠశాలలో డి ఎడిక్షన్ కార్యక్రమంలో సంగారెడ్డి బ్రహ్మకుమారీస్ కేంద్రం నిర్వాహకురాలు బీకే అన్నపూర్ణ బాల్యదశ నుండి వ్యసనాలకు దూరంగా ఉండాలని దేశ భవిషత్తు యువత పై ఉందని ఆమె తెలిపాం కేంద్ర ప్రభుత్వం సామాజిక సంస్థలు భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో బర్మకుమారి సంస్థలు యువతకు డిడక్షన్ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఆల్కహాల్, స్మోకింగ్, గంజాయి, సెల్ఫోన్, చెడు అలవాట్లు, చెడుగా ఆలోచించడం వంటి ఎన్నో శారీరక మానసిక సమస్యల యువత సమాజానికి దూరంగా ఉంటున్నారని తెలిపారు. యువత ఆటలు, సమాజసేవ, యోగ,మెడిటేషన్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని ఆమె అన్నారు విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి సమాజానికి సేవలందించాలని విశ్రాంత మండల విద్యాధికారి, న్యాయవాది డి అంజయ్య తెలిపారు. విద్యార్థులచే వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో కేజీబీవీ ప్రత్తేకాధికారి జె లలిత, చాముండేశ్వరి, ఉపాధ్యులు పాల్గొన్నారు.

# పాదయాత్రలు జయప్రదం చేయండి



నేరేడుచర్ల : (మన ప్రజాప్రతినిధి దినపత్రిక ):కంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక పాలనను నిరసిస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 14 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రల ను నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు తెలియజేశారు మంగళవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల లో పాదయాత్రల వాల్ పోస్టర్ ను సిపిఐ శ్రేణులతో కలిసి విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ..... తాము అధికారంలోకి రాగానే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని యువతను మోసం చేసిన బిజెపి ప్రభుత్వానికి యువత తగు రీతిలో బుద్ధి చెప్పాలని ,, తాము అధికారంలోకి వస్తే విదేశీ బ్యాంకులో ఉన్న నల్లధనం వెలికి తెచ్చి ప్రతి అకౌంటులో 15 లక్షల రూపాయలు వేస్తామని ప్రజలను మోసం చేశారని, అడ్డు అదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యజీవితావసర ధరలను తక్షణమే అరికట్టాలని, దేశ ప్రజలందరికీ ఉచితంగా విద్య, వైద్యం,న్యాయం అందించాలని రైతులు ఆరుగాలం పండించిన పంటలకు కనీసం మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని మహిళా రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను పరిరక్షించి నాలుగు కోడ్ లను ఎత్తివేసి 44 కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని అన్నిటికన్నా ముఖ్యంగా ఎన్నికల్లో ఈవీఎంలను ఎత్తివేసి బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని బ్యాలెట్ పేపర్ ద్వారా కూడా బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అప్పుడు ప్రజలకు బిజెపిపై నమ్మకం పెరుగుతుందని ఈవీఎంల ట్యాంపరింగ్ ద్వారా అధికారంలోకి వస్తున్న బిజెపి అసలు స్వరూపం బయటపడాలంటే బ్యాలెట్ పేపర్ పద్ధతులు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు గోడపత్రిక విడుదల చేసిన వారిలో మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మి ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు ఊదర వెంకన్న ఏఐటీయూసీ ప్రాంతీయ సహాయ కార్యదర్శి ముత్యాల భాస్కర్ బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ సిపిఐ సీనియర్ నాయకులు బెల్లంకొండ గోవిందు గౌడ్ ఏఐవైఎఫ్ మండలాధ్యక్షుడు పరికె భరత్ పట్టణ అధ్యక్షుడు వాడాల భాస్కర్ బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస గౌడ్ దోమకొండ మనోజ్ బండి శ్రీనివాస్ సిద్ధపంగ నరేష్ పాల్గొన్నారు

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి జన్మదిన వేడుకలు

నేరేడుచర్ల మన ప్రజాప్రతినిధి దినపత్రిక ):హుజూర్‌నగర్ మాజీ శాసనసభ్యులు,భారతీయ జనతా పార్టీ ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర అధ్యక్షులు శానంపూడి సైదిరెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం నేరేడుచర్ల పట్టణం లోని ప్రధాన కూడలిలో బీజేపీ పట్టణ,మండల కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి శానంపూడి సైదిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ....ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో శానంపూడి సైదిరెడ్డి అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు.రాబోయే ఎన్నికల్లో ఆయనను భారీ మెజారిటీతో గెలిపించి హుజూర్‌నగర్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల, పాలకవీడు పట్టణ,మండల కమిటీల నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఆగస్ట్ 04,:చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన కొమ్ము మోహన్ (37) మద్యం మత్తులో తన భార్యతో గొడవపడి, క్షణికావేశములో తన ఇంట్లో ఉన్న చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొని చనిపోయినాడు, మృతునికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు మృతుని భార్య కొమ్ము వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

## బలమైన భవిష్యత్తుకు తల్లిపాలే పునాది..సర్పంచ్ శివ



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్ :దుద్దెడ గ్రామ పంచాయితీ పరిధిలో గ్రామ సర్పంచ్ మిద్దె శివకుమార్ అధ్యక్షతన మహిళ సమస్యల పరిష్కారానికి గ్రామసభ తోపాటు ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను ఏఎన్ఎంలు తో నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ... మహిళల స్నేహ పూర్వకంగా ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఉండాలని అన్నారు. మహిళల కోసం సమస్యలు వస్తే వెంటనే పరిష్కారం చేసేలా కృషి చేస్తానన్నారు. అనంతరం అంగన్వాడి ఉపాధ్యాయులు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే తల్లిపాలు అందించాలని, తల్లిపాలు శిశువుకు సురక్షితమైనవి, స్వచ్ఛమైనవి, పోషక విలువలు కలిగినవని, శిశువు ఆరోగ్యవంతంగా ఎదగడానికి తల్లిపాలే బలమైన పునాదిగా నిలుస్తాయని వివరించారు. బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం తల్లిపాలు ఎంతో అవసరమని, శిశు వు పుట్టినప్పటి నుండి రెండు సంవత్సరాల వరకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలన్నారు. తల్లులు తీసుకునే పోషకాహారం ద్వారానే స్వచ్ఛమైన పాలు బిడ్డలకు అందుతాయని దీంతో పిల్లలు ఆరోగ్యంగా దృఢంగా ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మి,మహిళల సంఘాల సభ్యులు, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ సాగర్ రెండో దశ నీటిని విడుదల చేయాలి సీపీయం



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక తెలంగాణలో ఎల్నినో ప్రభావం చేత వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రైతాంగం అయోమయంలో పడ్డారని సిపిఎం పార్టీ నాయకులు బూరుగుల ప్రభాకర్ అన్నారు.సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో శ్రీరామ్ సాగర్ రెండో దశ కాలువ నీటి వినియోగదారులు, రైతులు, కాలువ నీరు వస్తుందని, ఆశించి వరి పొలాలు దున్ని నారు పోసి నాటు వేసే సమయం వరకు వేచి చూసిన రైతులకు నిరాశే మిగిలిందని ఆయన వాపోయారు. తిరుమలగిరి మండలం బండ్ల పెల్లి శ్రీరాంసాగర్ రెండో దశ కాలువ వద్ద ఒక నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూన్ జూలైలో వర్షాలు కురువక ,కాలువ నీరు రాక , నీటిని ప్రభుత్వం విడుదల చేయని కారణంగా రైతులు ఆందోళనలో పడిపోయి వ్యవసాయము చేయలేని దుస్థితిలో రైతులు తీవ్రమైన మనోక్షోభకు గురైతున్నారని తెలిపారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం , ప్రభుత్వ అధికారులు, నీటిపారుదల శాఖ మంత్రివర్యులు తక్షణమే స్పందించి శ్రీరామ్ సాగర్ రెండో దశ నీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బొడ్డు మల్లయ్య, బర్ల రామకృష్ణ, షేక్ అస్లాం పాషా, ముండ్ల నరేష్ , శంకర్. తదితరులు పాల్గొన్నారు

## అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన మహమ్మద్ రఫీ

మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా వెల్దుర్తి /చేగుంట ఆగస్ట్ 04:వెల్దుర్తి మండల మండల పరిదిలోని బస్వాపూర్ గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి చేగుంట మండల ఉప సర్పంచ్ ల పోరం అధ్యక్షులు, చేగుంట ఉప సర్పంచ్ మైనారిటీ నాయకులు మహమ్మద్ రఫీ 50 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలోగుడి పూజారి బసవన్న, దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ అశోక్ గౌడ్, కమిటీ సభ్యులు సుదర్శన్, సత్తయ్య, లచ్చయ్య, రాములు, సంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటి సమస్యకు పరిష్కారం



నేరేడుచర్ల//(మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ):నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు నరసయ్య గూడెంలో దెబ్బతిన్న బోరింగ్ కారణంగా తాగునీటి సమస్య ఏర్పడింది.ఈ విషయాన్ని స్థానికులు కౌన్సిలర్ నన్నెపంగ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా,మంగళవారం ఆయన వెంటనే స్పందించి బోరింగ్‌కు మరమ్మతులు చేయించారు.మరమ్మతు పనులను కౌన్సిలర్ స్వయంగా పర్యవేక్షించి సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.పనులు పూర్తికావడంతో బోరింగ్ ద్వారా తాగునీటి సరఫరా పునరుద్ధరించబడింది.సమస్యను సత్వరమే పరిష్కరించిన కౌన్సిలర్ నన్నెపంగ శ్రీనివాస్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## బోయిని రాజుకు పితృ వియోగం పరామర్శించిన రాజకీయ ప్రముఖులు



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం.చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల నాయకుడు,మాజీ మత్స్య శాఖ చైర్మన్ బోయిని రాజు తండ్రి బోయిని రామస్వామి(80) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు.విషయం తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు మంగళవారం గ్రామానికి చేరుకొని పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం బోయిని రాజును వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.రామస్వామి మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క,భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య,కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ఇంచార్జి,మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే బాబుమోహన్ లు పరామర్శించారు.అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించిన వారిలో మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు,మాజీ దేవస్థాన చైర్మన్ ఆడెపు చంద్రయ్య,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూర్మ ఆగంరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంజె మల్లేశం,ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్మురవి,చేర్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ముస్త్యాల అరుణ బాలనర్సయ్య,ఆయా పార్టీల నాయకులు దాసరి శ్రీకాంత్,అందే అశోక్,ఆముదాల మల్లారెడ్డి,కాటం సంజీవయ్య,అంకుగారి శ్రీధర్ రెడ్డి,పుర్మ వెంకట్ రెడ్డి,అందె నాని బాబు,శివగారి అంజయ్య,కామిడి రమేష్ రెడ్డి,కరెడ్ల మాధవ రెడ్డి,వెలుగల రఘువీర్,శేవల్ల రాజయ్య,ముస్త్యాల కిష్టయ్య,తాటికొండ వేణు గోపాల్,తాటికొండ సదానందం,చింతల పర్శరాములు,ఆకుల రాజు గౌడ్,చింతల మల్లేశం,గొల్లపల్లి కిష్టయ్య,మల్లిగారి నర్సింహులు, పాల బాలరాజు,పల్లె కనకయ్య,పోరండ్ల వెంకటేష్,యాట యాదగిరి,కడారి భాస్కర్,బోయిని బాలయ్య,బుట్టి బిక్షపతి,తాటికొండ రాములు,సూర సంపత్,ఉడుత బాలరాజు,గ్రామ పంచాయతీ పాలకవర్గం, జర్నలిస్టులు,గ్రామ, మండల ప్రజలు,తదితరులు పరామర్శించి,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## సిబ్బంది కుటుంబాలకు బాసటగా పోలీసు భద్రత స్కీమ్




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యపేట జిల్లా:సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం కుటుంబాల సంక్షేమానాకి భరోసా. కె. నరసింహ ఐపిఎస్,. జిల్లా యస్.పి.సూర్యాపేట జిల్లా పెనపహాడ్ పోలీస్ స్టేషన్ నందు హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న యాదగిరి ఇటీవల ఆకాలంగా మృతి చెందినారు. మృతి చెందిన యాదగిరి కుటుంబానికి పోలీసు భద్రత స్కీం యొక్క నగదు చెక్కు ను జిల్లా ఎస్పి.నరసింహ ఐపిఎస్ జిల్లా పోలీస్ కార్యాలయం నందు అతని కుటుంబ సభ్యులకు అందజేసినారు. పోలీసు శాఖలో పని చేస్తూ ఆకాలంగా ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలను పోలీసు శాఖ అన్ని విధాలుగా అదుకుంటుందని, దివంగత సిబ్బంది కుటుంబాలకు పోలీసు భద్రత స్కీమ్ బాసటగా నిలుస్తుంది అన్నారు. యాదగిరి కుటుంభం యొక్క సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పి తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డీఎస్పీ రవి, జిల్లా పోలీసు కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, పోలీసు సంఘం అధ్యక్షులు ఎస్సై రామచందర్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

## కబ్రస్తాన్ నిధులు మంజూరు కోసం రాజిరెడ్డి ని కలిసిన ముస్లిం నాయకులు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఆగస్ట్ 04:మెదక్ జిల్లా మసాయిపేట్ పట్టణ కేంద్రానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు మంగళవారం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టి ఇంచార్జ్ అవుల రాజి రెడ్డి నివాసంలో కలిసి పట్టణ కభ్రస్థాన్ (శ్మశానవాటిక) అభివృద్ధికి కొరకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు ,, ఈ సందర్బంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ పట్టణ కేంద్రంలో ఉన్న కభ్రస్థాన్ చుట్టూ రక్షణ గోడ (ప్రహరీ గోడ) లేకపోవడం, లోపల కంపచెట్లు పెరిగిపోవడం, నీటి వసతి మరియు అంతిమసంస్కారాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు (లైటింగ్, రోడ్లు) సరిగ్గా లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నామని, ప్రహరీ గోడ కోసం నిధులు మంజూరు చేయాలని కోరగా, వెంటనే స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆగిన అంగన్వాడి కేంద్రం



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక అల్లాదుర్గ్ మండలం:సగములో ఆగిన అంగన్వాడి కేంద్రం మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామంలో ఆగిపోయిన అంగన్వాడి కేంద్రం ఇంతకుముందు కూడా ఒకచోట సగంలో వేసి వదిలేశారు. ఇప్పుడు కూడా సగంలో స్లాబ్ వేసి ఆపేశారు. గర్భిణీలు బాలింతలు పిల్లలు చదువు కోవడానికి వస్తుంటారు. చెప్పడానికి అంగన్వాడి కేంద్రాలు అద్దెకు తీసుకొని నడిపిస్తున్నారు .అలా కాకుండా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అంగన్వాడి కేంద్రాలు నిర్మించాలని చెబుతున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నత్తనడకన పనులు నిలిపివేయడం జరిగింది.వెంటనే జిల్లా అధికారు స్పందించి వెంటనే ఆగిన అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## హైవేపై గుంతలను పూడ్చిన సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:సూర్యపేట పట్టణం ట్రాఫిక్ పోలీస్‌రోడ్డు ప్రమాదాల నివారణకే ప్రాధాన్యత.సూర్యాపేట జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, పట్టణ ట్రాఫిక్ ఎస్సై మరియు సిబ్బంది మంగళవారం రోజు సామాజిక బాధ్యతను చేపట్టారు. సూర్యాపేట పట్టణ పరిధిలోని గల జాతీయ రహదారి 65 (నేషనల్ హైవే 65) పై వాహనదారులకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న పెద్ద పెద్ద గుంతలను ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రోజు దగ్గరుండి పూడ్చివేయించారు. విస్తరణ పనులు, వర్షాలు, వాహనాల రద్దీ కారణంగా సూర్యాపేట పట్టణ పరిధిలో జాతీయ రహదారిపై ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి. దీనివల్ల ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాల చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాల వేగం అకస్మాత్తుగా తగ్గడం వల్ల ట్రాఫిక్ జామ్‌లు కూడా ఏర్పడుతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, తక్షణమే స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలను మట్టి, కంకరతో నింపి తాత్కాలికంగా మూసివేశారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రోడ్డును సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారుల భద్రతే మా మొదటి ప్రాధాన్యత అని తెలిపారు. జాతీయ రహదారిపై ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యగా ఈ గుంతలను పూడ్చినట్లు పేర్కొన్నారు. హైవేపై ప్రయాణించే వాహనదారులు కూడా నిఘా నిబంధనలు పాటిస్తూ, పరిమిత వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన కోరారు.

## కారేపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మంకారేపల్లి పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ కు నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులను, సీజ్ చేసిన వాహనాలు, పరిసరాలను పరిశీలించారు. సెక్టర్ పోలీస్ ఆఫీసర్లతో మాట్లాడారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, పెండింగ్ కేసులు పరిశీలించారు. విధిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. రౌడీ షీటర్లపై దృష్టి పెట్టాలని, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితుల ఫిర్యాదుపై వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ తిరుపతి రెడ్డి, సిఐ సాగర్, ఎస్సై గోపి పాల్గొన్నారు.

## బాలసభలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి సర్పంచ్




ప్రజాప్రతినిధి కొండపాక మండల్ :మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గ్రామ సర్పంచ్ కొయ్యడ వెంకటేశం గౌడ్ అధ్యక్షతన బాలసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల కోసం బాలలే నిర్వహించుకునే బాలసభలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, బాధ్యతయుతమైన ఆలోచన విధానాన్ని పెంపొందిస్తాయని అన్నారు. పాఠశాల ఆవరణను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులు క్రమశిక్షణతో చదువులో రాణించాలని సూచించారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని ఉపాధ్యాయులు, గ్రామ ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ తరపున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల సమగ్రభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టింగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తల్లి పాలలోనే బిడ్డకు సంపూర్ణ పోషకాలు కలెక్టర్ గరిమ అగ్రవాల్




మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల ఆగష్టు, 04 :తల్లి పాలలోనే బిడ్డకు కావలసిన సంపూర్ణ పోషకాలు ఉంటాయని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. 'ప్రపంచ తల్లి పాల వారోత్సవాల' (ఆగస్టు 1-7) సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రసవమైన గంటలోనే బిడ్డకు తల్లి పాలు పట్టాలని, మొదటి ఆరు నెలలు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.తల్లి పాలు బిడ్డ ఎదుగుదలకు, బరువు పెరిగేందుకు దోహదపడటంతో పాటు బాలింతలను క్యాన్సర్ వంటి వ్యాధుల నుంచి కాపాడుతాయని పేర్కొన్నారు.నర్సింగ్ విద్యార్థులు నాటిక ద్వారా తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించగా, కలెక్టర్ పోస్టర్లను ఆవిష్కరించి బాలింతలకు పండ్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ సబ్‌స్టేషన్ అంశంపై విద్యుత్ శాఖ అధికారిని కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:మేడ్చల్ జిల్లా కాప్రా డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్‌లో ప్రతిపాదించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుపై స్థానిక ప్రజలు వ్యక్తం చేస్తున్న ఆందోళన నేపథ్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హబ్సిగూడ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆపరేషన్) ఇంజి.పి. వెంకన్న గారిని వారి కార్యాలయంలో ఉప్పల్ లో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,నివాసాల మధ్య విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల వైబ్రేషన్,శబ్ద కాలుష్యం తదితర సమస్యలతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ప్రజల అభ్యంతరాలను గౌరవించి, సాయిబాబా నగర్‌లో సబ్‌స్టేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని లేదా జనావాసాలకు దూరంగా ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించాలని కోరారు.ప్రజల భద్రత, ఆరోగ్యం,ప్రశాంత జీవనమే తమకు ముఖ్యమని, స్థానికుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులను కోరారు.ఈ సందర్భంగా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇంజి. పి.వెంకన్న ఎమ్మెల్యే వినతిని స్వీకరించి, ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సురక్ష కా తిరంగా సైబర్ స్వతంత్ర తెలంగాణ




మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక కొత్తగూడెం జిల్లా:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంపోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆగస్టు-2026 స్వాతంత్ర్య మాసం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "సురక్ష కా తిరంగా సైబర్ స్వతంత్ర తెలంగాణ" సైబర్ అవగాహన ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ మంగళవారం నాడు జిల్లా ఎస్పి కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆగస్టు నెల పొడవునా సైబర్ నేరాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సైబర్ ఆధారిత ఆర్థిక నేరాలు, ముఖ్యంగా స్టాక్ ఇన్వెస్ట్మెంట్ మోసాలు, బిజినెస్ ఇన్వెస్ట్మెంట్ మోసాలు వంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు."సురక్ష కా తిరంగా" ప్రచార సందేశమైన "ఆగు ఆలోచించు, నిజం నిర్ధారించు, సైబర్ భద్రత పెంచు" అనే మూడు అంశాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.జాతీయ సైబర్ జాగృక్తా దివస్ సందర్భంగా 05.08.2026 నుంచి జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు మరియు సాధారణ ప్రజల భాగస్వామ్యంతో నెల పొడవునా సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ కు కాల్ చేయాలని ప్రజలకు సూచించారు. ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉంటేనే సైబర్ అవగాహన కలిగిన, సైబర్ సురక్షితమైన, సైబర్ స్వతంత్ర తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, సైబర్ సెల్ సీఐ జితేందర్, ఎస్బి శ్రీశ్రీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, సైబర్ సెల్ ఎస్సై జుబేదా బేగం సైబర్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా భాస్కర్ రెడ్డి నియామకం




మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్:జడ్పిహెచ్ఎస్ బాయ్స్ కొండపాక లోని ఉపాధ్యాయుడు ఎన్ భాస్కర్ రెడ్డి ఫిజికల్ డైరెక్టర్ సిద్దిపేట జిల్లా ఎస్జీఎఫ్ డిస్టిక్ స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గా నియమించబడిన సందర్భంగా అభినందన సమావేశం నిర్వహించి సన్మాన కార్యక్రమం చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు సముద్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ భాస్కర్ రెడ్డి పాఠశాల వసతుల కల్పనలో విద్యార్థులను క్రీడలలో మండల జిల్లా రాష్ట్రస్థాయిలో ఉత్తమ పథకాల సాధనలో విద్యార్థుల పట్ల చేసిన కృషిని తెలియజేస్తు వివిధ సేవా సంస్థల ద్వారా విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ బ్యాగులు నోట్ బుక్స్ ఎగ్జామ్ పాడ్స్ ఎగ్జామ్ మెటీరియల్ మొదలైన కల్పించుటకు చేసిన కృషిని అభినందించి వారి తల్లిదండ్రులు కీర్తిశేషులు నర్రా రఘుపతి రెడ్డి సరోజన దేవి జ్ఞాపకార్థం నూతనంగా జడ్పిహెచ్ఎస్ బాయ్స్ కొండపాక పాఠశాలలో చేరిన విద్యార్థులకు సైకిల్స్ అందజేసి గత ఎనిమిది సంవత్సరాలుగా జోనల్ స్థాయిలో బాక్సింగ్ పోటీలను పాఠశాల ప్రాంగణంలో అత్యంత ఘనంగా నిర్వహించి విద్యార్థులను రాష్ట్రస్థాయి ఎంపికకు తోడ్పడి రాష్ట్రస్థాయిలో ఎన్నో పథకాల సాధనలో మార్గదర్శకుడిగా నిలిచాడని సమావేశంలో భాస్కర్ రెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి శ్రీలత, ఎం శోభారాణి, పి విజయలక్ష్మి ఉపాధ్యాయులు అశోక్, బీ తిరుపతి వై రవీందర్ రెడ్డి, పి బాలకిషన్,డి శ్రీనివాస్ రెడ్డి రికార్డ్ అసిస్టెంట్ సాబీర్ హుస్సేన్ సి ఆర్ పి జై బాలకిషన్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్కైరూట్ ఏరోస్పేస్ యువ ఇంజినీర్లకు జేఎన్టీయూ సిరిసిల్లలో ఘన సన్మానం




మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల ఆగష్టు,04:ప్రముఖ అంతరిక్ష పరిశోధనా సంస్థ 'స్కైరూట్ ఏరోస్పేస్'లో కీలక పాత్ర పోషించిన యువ ఇంజినీర్లు అడుపు సంతోష్ కుమార్, అడుపు కిరణ్, బొమ్మదేవి నాగరాజులను రాజన్న సిరిసిల్లలోని జేఎన్టీయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వేణుగోపాల్ మాట్లాడుతూ.. మన చుట్టూ ఉన్న సాధారణ వ్యక్తులే పట్టుదలతో గొప్ప లక్ష్యాలను సాధించి దేశానికి గర్వకారణంగా నిలవగలరని ఈ యువ ఇంజినీర్లు నిరూపించారని కొనియాడారు. వారి విజయం ప్రతి విద్యార్థికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అనంతరం సన్మాన గ్రహీతలైన ఇంజినీర్లు మాట్లాడుతూ.. "ఇంగ్లీష్‌పై పూర్తి పట్టు లేదా కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేవని ఎవరూ నిరుత్సాహపడకూడదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన మేము కూడా భారతదేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ విజయవంతమైన ప్రయోగంలో కీలక పాత్ర పోషించగలిగాము. నిరంతర కృషి, సానుకూల దృక్పథంతో ముందడుగు వేస్తే ఏ రంగాన్నైనా జయించవచ్చు" అని విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపారు.ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వేణుగోపాల్ ఏర్పాట్లలో, ప్రొఫెసర్ ధీరజ్ సునేహ్ర సమన్వయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు

## గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లానే లక్ష్యంనార్కోటిక్ జాగిలంతో ఎల్లారెడ్డిపేటలో ముమ్మర తనిఖీలు



మనప్రజాప్రతినిధి/ఎల్లారెడ్డిపేట ఆగష్టు ,04 :రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాదకద్రవ్యాల (డ్రగ్స్, గంజాయి) వినియోగం, అక్రమ రవాణా, క్రయవిక్రయాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే గారి ఆదేశాల మేరకు మంగళవారం ఆర్.ఐ (అడ్మిన్) ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నార్కోటిక్ జాగిలం (స్నిఫర్ డాగ్) సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట పరిధిలోని పలు కిరాణా షాపులు, పాన్ షాపులు, బస్టాండ్‌తో పాటు పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాలను నార్కోటిక్ జాగిలంతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వల్ల యువత తమ విలువైన భవిష్యత్తును దెబ్బతీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజలు, విద్యార్థులు, యువతకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, అలవాట్లపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రజా రద్దీ ప్రాంతాల్లో ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్ లేదా గంజాయి అమ్మకాలు, రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో గానీ, లేదా తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ నంబర్ 8712671111 కి గానీ సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అధికారులు హామీ ఇచ్చారు.

# 20 వార్డ్ లో సీసీ రోడ్ పనులకి శంకుస్థాపన చేసిన మున్సిపల్ చైర్పర్సన్ అన్నన్యా గారు



ప్రజాప్రతినిధి//ఆగస్ట్ 04:తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిచొరవతో స్థానిక కౌన్సిలర్ జైదుపల్లిలక్ష్మిగారి ఆధ్వర్యంలో 60 కోట్ల నిధులతో వికారాబాద్ మున్సిపల్ లోని 20వార్డ్ రాజీవ్ గృహకల్ప, అన్నతగిరిపల్లి లోని సీసీ రోడ్, అండర్ గ్రౌండ్ డైనేజ్ మరియు ఓపెన్ డ్రైనేజీ కి సంబంధించి ఈ రోజు లికౌన్సిలర్ జైదుపల్లి లక్ష్మి లిగారితో కలిసి శంకుస్థాపన చేసారు ఈ కార్యక్రమం లో జైదుపల్లి మురళీ గారు మున్సిపల్ ఐజు, వార్డ్ ఆఫీసిర్ వర్క్ ఇన్స్పెక్టర్ మరియు నాయకులు కాలని మహిళలు పెద్దలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మొక్కలు నాటి,పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఎంసీ కమిషనర్ విజయ్ కృష్ణా రెడ్డి (ఐఏఎస్), జోనల్ కమిషనర్ రాధికా గుప్తా ఐఏఎస్ పాల్గొని, నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ,"ఒక్కో వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షిస్తే భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించగలం. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పరిరక్షించడం కూడా అందరి బాధ్యత" అని అన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ.1.16 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ,జెరిపోతుల ప్రభుదాస్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:మేడ్చల్ జిల్లా ఉప్పల్ మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్,ఆగస్టు 4: మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్, కృష్ణానగర్, తిరుమలనగర్ కాలనీలలో రూ.1.16 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బాక్స్ డ్రైన్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటూ, ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులకు పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.మాజీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ, డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి విశేష సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం వేణుగోపాల్, ఏజీఎం రోహిత్, ఏఈ స్పందన, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, మల్లేష్ గౌడ్, మల్లారెడ్డి, దేవిరాజ్, జంపాల్ రెడ్డి, సత్తిరెడ్డి, నరసింహ గౌడ్, నవీన్ గౌడ్, బాలయ్య గౌడ్, అంజయ్య గౌడ్, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, రాజు, రామకృష్ణ, చక్రవర్తి, కిరణ్, శేఖర్ గౌడ్, శివ, కోటి రెడ్డి, నరసింహ గౌడ్, బాల్ రెడ్డి, కామేశ్వరరావు, కృష్ణమోహన్, శ్రీనివాస్, మురళీ ప్రసాద్, రామ్ రెడ్డి, మాధవరావు, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, మాలాద్రి, సుబ్బారెడ్డి, నారాయణ రెడ్డి, శంకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మూర్తి, వెంకటేశ్వరరావు, ఆర్టీసీ గౌరీశంకర్, గౌరీశంకర్, దండెం నరేందర్‌తో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గౌడ కులస్తుల బోనాల పండుగ అంగరంగ వైభవంగా సదాశివపేట పట్టణములో





సదాశివపేట (మనప్రజాప్రతినిధి): మంగళ వారం ఈరోజు సదాశివపేట పట్టణములు గౌడ కులస్తుల బోనాల పండుగ అంగరంగ వైభవంగా జరిగింది ఇటి కార్యక్రమం సిహెచ్ శ్రీనివాస్ గౌడ్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గౌడ సంఘం అధ్యక్షులు గారి ఆధ్వర్యంలో గౌడ కులస్తుల అంతా కలిసి దుర్గా భవాని మాతకి బోనాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పాల్గొనడం జరిగింది. అలాగే చింతాగోపాల్ చింత సాయికుమార్ ఎర్ర నరసింహ గౌడ్ పెద్ద గౌడ్ సిహెచ్ శంకర్ గౌడ్ ఎర్ర నాగరాజ్ గౌడ్ కోవూరి మానయ్య గౌడ్ గడీల కృష్ణ గౌడ్ శంకర్పల్లి శ్రీనివాస్ గౌడ్ , కోవూరి సత్యనారాయణ గౌడ్, గౌడ కులస్తులందరూ పాల్గొనడం జరిగింది

# విద్యుత్ సబ్‌స్టేషన్ అంశంపై విద్యుత్ శాఖ అధికారిని కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:మేడ్చల్ జిల్లా కాప్రా డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్‌లో ప్రతిపాదించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుపై స్థానిక ప్రజలు వ్యక్తం చేస్తున్న ఆందోళన నేపథ్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హబ్సిగూడ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆపరేషన్) ఇంజి.పి. వెంకన్న గారిని వారి కార్యాలయంలో ఉప్పల్ లో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,నివాసాల మధ్య విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల వైబ్రేషన్,శబ్ద కాలుష్యం తదితర సమస్యలతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ప్రజల అభ్యంతరాలను గౌరవించి, సాయిబాబా నగర్‌లో సబ్‌స్టేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని లేదా జనావాసాలకు దూరంగా ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించాలని కోరారు.ప్రజల భద్రత, ఆరోగ్యం,ప్రశాంత జీవనమే తమకు ముఖ్యమని, స్థానికుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులను కోరారు.ఈ సందర్భంగా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇంజి. పి.వెంకన్న ఎమ్మెల్యే వినతిని స్వీకరించి, ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.




# సీఆర్పీఎఫ్ శిబిరంలో కాల్పుల కలకలం

**-సహచరులపై కాల్పులు జరిపిన జవాన్**

**-ఇద్దరు జవాన్లు మృతి.. మరొకరికి గాయాలు**

**-ఆ తర్వాత తాను కాల్చుకుని ఆత్మహత్య**

**-ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన అధికారులు**



గువాహటి, ఆగస్టు 4 (మనప్రజాప్రతినిధి): అసోంలోని నాగోన్ జిల్లాలోని కాటిమారి ప్రాంతంలో ఉన్న కేంద్ర రిజర్వు పోలీసు దళం 34వ బెటాలియన్ శిబిరంలో మంగళవారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ జవాన్ తన సహచరులపై కాల్పులు జరపడంతో ఇద్దరు జవాన్లు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం కాల్పులకు పాల్పడిన జవాన్ తనపై తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ బల్లాని ప్రేమాంబరం శిబిరం ప్రధాన ద్వారం వద్ద విధుల్లో ఉండగా అకస్మాత్తుగా తన సహచరులపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో హెడ్ కానిస్టేబుల్ విష్ణు ప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్ రమ్నావాల్ సింగ్ యాదవ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు.కాల్పుల్లో మరో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ శ్రీపుల్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సహచరులపై కాల్పులు జరిపిన అనంతరం బల్లాని ప్రేమాంబరం తనపై తాను కాల్పులు జరుపుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాల్పుల శబ్దం విని అధికారులు, ఇతర జవాన్లు ఘటనాస్థలికి చేరుకునేలోపే అతడు ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ ఘటనకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు. వ్యక్తిగత కారణాలా, విధులకు సంబంధించిన ఒత్తిడా, లేక మరే ఇతర కారణమా అనే కోణాల్లో విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనపై కేంద్ర రిజర్వు పోలీసు దళం, స్థానిక పోలీసులు సంయుక్తంగా విచారణ చేపట్టారు. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం కాల్పులకు దారితీసిన పరిస్థితులపై